# వాళ్లిద్దరూ...

## -సూరేపల్లి విజయ

ఆకాశానికి, భూమికి మధ్య చీకటి పరదా వేలాడుతోంది. ఎప్పుడూ కలవని పట్టాలమీద రైలు కలిసే వెళ్తుంది. చెట్లు, ఇళ్లు, కరెంటు స్తంభాలు కనుమరుగవుతూనే ఉన్నాయి. కిటికీ పక్కనే కూర్చున్న సౌమిత్ర కిటికీలో నుండి బయటకు చూస్తోంది. చుట్టూ గాఢాంధకారం తన మనసులా.

ప్రక్కనే చంద్రశేఖరం కూడా ఏదో ఆలోచిస్తున్నాడు. వృద్ధాప్యపు ఛాయలు ఆమెలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. నెరిసిన జుట్టు, అక్కడక్కడ ముడతలు పడ్డ శరీరం, మానసికమైన అనారోగ్యం. యాభై అయిదేళ్లకే వందేళ్ల జీవితాన్ని అనుభవించింది. ఆమె నుదురు బోసిగా వుంది.

''ఏవండీ! నేను తప్పు చేసానా?'' సౌమిత్రి చంద్రశేఖరం భుజంమీద తల వాల్చి అడిగింది.

అరవయ్యేళ్ల చంద్రశేఖరం ఓ నిట్టూర్పు విడిచి ''లేదు సౌమిత్రి. పిల్లలు పేరుతో నువ్వు, నీమీద ప్రేమతో నేను ముప్పయ్యేళ్లు మౌనంగా రోదిస్తూ దూరంగా గడిపాము. జీవితం తాలూకు అనుభవాలు మనిద్దరి మీద బలమైన ముద్ర వేసాయి. పిల్లలే జీవితంగా, వాళ్లు అనాథలు కాకూడదని, మనసుని, వయసుని త్యాగంతో సమాధిచేసి బ్రతికావు. ఇన్నాళ్లు వైధవ్యాన్ని గురించి, బరువు బాధ్యతలను భుజాలపై భరించి అనుక్షణం అహర్నిశలు నీ పిల్లలే జీవితంగా బ్రతికావు. ఈ రోజు వాళ్లకంటూ ఓ జీవితం వుంది. ఓ మార్గం వుంది. నువ్వు లేకపోయినా వాళ్లు జీవించగలరు. వాళ్లు అనాథలు కారు. వాళ్లకన్నీ సమకూర్చిన నిన్నే అనాథగా మార్చారు. ముప్పయ్యేళ్ల క్రితం నాక్కావాల్సిన తోడును వాళ్లకు తోడుగా వుండడం కోసం వదులుకున్నావు. ఈ వయసులో కనీసం జీవితపు చివరి దశలోనైనా ఓ తోడు కావాలని నువ్వు కోరుకోవడం తప్పుకాదు'' చంద్రశేఖరం ఉద్విగ్నంగా చెప్పుకుపోతున్నాడు.

సౌమిత్రికి గతం గుర్తుకు వస్తోంది. మనసు కథ, మనసు వెత, గుండెల్లో సుళ్లు తిరిగి కళ్లల్లో నీళ్లుగా రూపాంతరం చెంది మసక మసగ్గా అదిగో అదే తన గతం...తన వెతల జీవితం. ఎన్ని అవమానాలు, ఎన్ని ఒడిదుకుడులు, ఎన్నెన్ని కన్నీళ్ల సరస్సులు.

★★★

ఇరవై అయిదేళ్ల సౌమిత్రి భర్త శవం దగ్గర స్తబ్దుగా కూర్చుంది. ఆమెకు ఏడుపు రావడంలేదు. భర్తవల్ల ఆమెకు ఏమాత్రం సంతోషం కలగలేదు. కన్నీళ్లు ఇంకిపోయాయి. ఆమె ఒడిలో కష్టాలు చేరిపోయాయి. పిల్లలు మాత్రం తల్లి దగ్గర కూర్చుని ఏడుస్తున్నారు. వచ్చినవాళ్లు ఎవరిష్టం వచ్చినట్టు వాళ్లు మాట్లాడుకుంటున్నారు.

అన్నీ సౌమిత్రి చెవిలో పడుతూనే వున్నాయి. సౌమిత్రి గురించి బాగా తెలిసినవాళ్లు ''ఆయన ఉన్నప్పుడు మాత్రం ఏం సుఖపెట్టాడు? తాగి వచ్చి రోజూ దెబ్బలు కొట్టడమేనా?'' అంటున్నారు.

''ఆయనపోతే మరొకరు. వయసుంది. అందముంది. ఎంతమందినైనా మార్చగలదు. అందుకే ఏడవడంలేదు'' ఇలా ఎవరికి తోచిన విధంగా వాళ్లు అనుకుంటున్నారు.

యాంత్రికంగా అన్నీ జరిగిపోతున్నాయి. రోజులు ఎవరి కోసం ఆగవు. దశదిన కర్మ కూడా జరిగిపోయింది. వచ్చినవాళ్లందరూ వెళ్లిపోతున్నారు.

సౌమిత్రి వాళ్లన్నయ్య వెళ్లేముందు చెల్లెలు దగ్గరకు వచ్చి ''ఈ వయసులో నీకు రావాల్సిన కష్టంకాదు. ఉన్న ఐదేళ్లు నీతో కాపురం చేసి తాగుడుకు బానిసై నీకు నరకం చూపించాడు. నీది ఏమంత పెద్ద వయసు కాదు. మళ్లీ పెళ్లి చేసుకో'' అన్నాడు.

''వద్దన్నయ్యా. ఈ ఒక్క పెళ్లితో నూరేళ్ల అనుభవం వచ్చింది. నేనుండగా నా పిల్లలకు అన్యాయం జరగనివ్వను. తల్లీదండ్రీ నేనే అయి వాళ్లను పెంచుతాను. ఎవరికీ భారం కాను. నా బ్రతుకు నేను బ్రతుకుతాను. మీరు వెళ్లండి'' అంది. జీవితం తాలూకు అనుభవాలు, పిల్లల బాధ్యత ఆమెతో అలా మాట్లాడించింది.

★★★

డిగ్రీ చదివిన సౌమిత్రి ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఒక ప్రైవేటు కంపెనీ నుండి పిలుపు వచ్చింది. తన బయోడేటా తీసుకుని వెళ్లింది. అక్కడ తనలాంటివాళ్లు చాలామంది ఉన్నారు. వాళ్లందర్నీ చూడగానే ఉద్యోగం తనకు వస్తుందో రాదో అనే దిగులు పట్టుకుంది. ఇంతలో అటెండర్ వచ్చి ఆమెను పిలిచాడు. ఆమె అతని వెంట వెళ్లింది. అతను బాస్ రూమ్ చూపించాడు. ఆమె లోపలకి వెళ్లింది. లోపల నలభై ఏళ్ల బట్టతల వ్యక్తి కూర్చుని వున్నాడు. ఆమెను చూసి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చోమన్నాడు. ఆమె నమస్కరించి కూర్చుంది. తెచ్చిన సర్టిఫికెట్లు అన్నీ అతనికిచ్చింది. అతను వాటిని తీసుకున్నాడు. కానీ తీసి చూడలేదు.

''మీకు ఈ ఉద్యోగం అవసరమా?'' అడిగాడు.

''చాలా అవసరం సార్. నా భర్త పోయారు. పిల్లలు, నేను ఏ ఆధారం లేకుండా ఉన్నాము. దయచేసి నాకే ఉద్యోగం ఇప్పించండి సార్'' అని దీనంగా అడిగింది.

''నీకు భర్తలేడు. ఏ ఆధారంలేదు. మరి ఓవర్ టైమ్ జాబ్ చేయగలవా?'' అన్న మాటను వత్తి పలుకుతూ ఆమె కళ్లల్లోకి కాంక్షగా చూస్తూ అడిగాడు. మగవాడి చూపుల అర్థం ఆడది ఇట్టే గ్రహిస్తుంది. సౌమిత్రి వెంటనే లేచి సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లిపోయింది.

★★★

ఆమె జీవన భృతికై సాగించే వేట మళ్లీ మొదలైంది. ఆడదాన్ని మగాడు ఎన్ని రకాలుగా ఎక్స్‌ప్లాయిట్ చేయగలడో ఈ ఉద్యోగం వేటలో తెలిసింది.


తను ఉద్యోగం వేటలో వెళ్తే ఉద్యోగమిచ్చే వాళ్లు తమ చూపులతో, కోరికలతో తన శరీరాన్ని వేటాడాలని చూస్తున్నారు. ప్రపంచమంటే ఏమిటో బోధపడింది. అయినా ఆ అనుభవాలు ఆమె ప్రయత్నాన్ని నిరోధించలేదు.

సరిగ్గా అప్పుడే చంద్రశేఖరం పరిచయం అయ్యాడు. నిరుద్యోగాన్ని తన ఆత్మవిశ్వాసంతో జయించి ఓ చిన్నపాటి కాన్వెంట్‌ని నడుపుతున్నాడు.

తన కాన్వెంట్‌లో టీచర్‌గా జాబ్ చేయమని చెప్పాడు. వాడి చూపులతో బాధించలేదు. వేడి కోరికలతో తనను దహించేలా చూడలేదు. యక్ష ప్రశ్నలతో తనను కించపర్చలేదు. అదిగో అలా పరిచయం అయ్యింది చంద్రశేఖరంతో.

ఆ పరిచయం వాళ్లిద్దరిని స్నేహితులుగా మార్చింది.

తన దినచర్యని యంత్రంలా చేసుకుపోతోంది సౌమిత్రి. కోడికూతతో ప్రారంభమయ్యేది దినచర్య.



పిల్లలకు టిఫిన్లు చేయడం, అన్నం బాక్సుల్లో సర్దడం, యూనిఫాం రెడీ చేయడం, రిక్షాలో స్కూలుకు పంపించడం, ఆ తరువాత హడావుడిగా తనూ తయారై స్కూలుకు వెళ్లడం, అక్కడ సాయంత్రం వరకూ స్కూల్ పిల్లలతో, పుస్తకాలతో కుస్తీ...ఆ తర్వాత ఇంటికి పరుగెత్తుకు రావడం.

స్కూలు నుండి రాగానే కాఫీ ఇవ్వడం, మళ్లీ వాళ్ల భోజనాలకు ఏర్పాట్లు చేయడం, ఓ గంటసేపు వాళ్లకు ట్యూషన్ చెప్పడం...ఇదంతా నిత్యకృత్యం.

వచ్చే జీతం చాలా పొదుపుగా ఖర్చు పెడుతుంది. తనకంటూ ఏమీ సమకూర్చుకోలేదు. పిల్లల కోసం...అంతా పిల్లల కోసమే.

సరిగ్గా అప్పుడే ప్రపోజ్ చేసాడు చంద్రశేఖరం.

ఆమె స్థాణువైంది. అది ఆనందమో, విస్మయమో, రెండింటికీ అతీతమైన మరే భావమో!

''సౌమిత్రి! మీరు నాకు నచ్చారు. నాకు మీ గతం తెలుసు, వర్తమానం తెలుసు. మీరొప్పుకుంటే మనం పెళ్లి చేసుకుందాం. పిల్లలు మనతోపాటే వుంటారు''

ఆమె ఆలోచించను కూడా లేదు. వెంటనే చెప్పింది-

''క్షమించండి. ఇప్పుడు నా కోసం, నా జీవితం కోసం ఆలోచించడంలేదు. ఆ దశ చేయి జారిపోయింది. పిల్లలూ, వాళ్ల భవిష్యత్తు ముఖ్యం. నన్ను మన్నించండి. మరొకరైతే మీ ప్రపోజల్ వరంగా భావించేవాళ్లు. కానీ ఆ వరం నా పిల్లలకు శాపం కాకూడదు. సవతి తల్లిని ఎలా భరించలేరో మరో వ్యక్తిని తండ్రిగా కూడా ఏ పిల్లలూ అంగీకరించలేరేమో! నాకు పునర్జన్మ ఇవ్వాలనే మీ కోరిక తిరస్కరిస్తున్నందుకు మన్నించండి''

చంద్రశేఖరం తన నిర్ణయాన్ని చెప్పేసాడు.

''మీ కోసం ఎదురుచూస్తాను. మీ బాధ్యతలు తీరేవరకు మీకు నా తోడు అవసరమని భావించేవరకూ ఎదురుచూస్తాను. అప్పటివరకూ మనం మంచి ఫ్రెండ్స్'' అంటూ ఆ టాపిక్ అంతటితో కట్ చేసాడు.

★★★



పిల్లలు పెద్దవాళ్లవుతున్నారు. సౌమిత్రి తలలో అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు. పిల్లలు కాలేజీ నుంచీ యూనివర్శిటీకి, అక్కడ నుండి ఉద్యోగ ప్రపంచంలోకి అడుగుపెట్టారు.

ఇప్పుడు అందరూ సంపాదిస్తున్నారు. పెళ్లిళ్లు అయ్యాయి. సౌమిత్రి అమ్మ నుండి బామ్మ పోస్టుకు ప్రమోట్ అయ్యింది.కళ్లు మసకబారాయి. కళ్లజోడు కొత్తగా ఆమెతో వచ్చి చేరింది. సౌమిత్రి వార్ధక్యాన్ని తోడు తెచ్చుకుంది. ఆమెలో శారీరకంగా ఎన్నో మార్పులు. శరీరం ముడతలు పడుతోంది. మారనిది చంద్రశేఖరం మనసు ఒక్కటే.

ఇంకా...ఇంకా ఆమె కోసం ఎదురుచూస్తూనే వున్నాడు.

ఇప్పుడు సౌమిత్రి గురించి ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. ఆమె అవసరం వాళ్లకు లేదు. పైగా ఆమె ఇప్పుడు వాళ్లకు అదనపు బాధ్యత. ఉద్యోగం మానేసింది.

సంపాదన లేని తల్లిని పోషించడం బరువుగా ఫీలయ్యే బిడ్డలయ్యారు.

ఆ పరిస్థితిలోనే మలేరియా వచ్చిన సౌమిత్రిని ఒంటరిగా వదిలేసారు. ఆమెను పట్టించుకోవడానికి టైం లేకపోయింది.

చంద్రశేఖరం అప్పుడామెకు తోడయ్యాడు.

ఆమెకు ఆలంబన అయ్యాడు. అహర్నిశలు ఆమె పక్కనే వున్నాడు. సౌమిత్రి కోలుకుంది. ఇప్పుడు తనకో తోడు అవసరం. తన అవసరం తన పిల్లలకులేదు. కానీ తనకు అవసరమైన వాళ్లు...ఆ నిర్ణయమే చంద్రశేఖరాన్ని పెళ్లి చేసుకోవాలనుకోవడం.

ఈసడింపులు, చీత్కారాలు, పెదవి విరుపుల మధ్య వార్ధక్యంలో వాళ్లిద్దరూ దంపతులయ్యారు. ఒకరికొకరు చేయూత అయ్యారు.

★★★

సౌమిత్రి ఉలిక్కిపడి గతంలో నుండి వర్తమానంలోకి వచ్చింది.

''వద్దు సౌమిత్రి! కంట తడి పెట్టించే గతం నీ వెంట వద్దు. మనంగా వెళ్దాం. ఈ సమాజపు సరిహద్దులు దాటి సుదీర్ఘ దూరతీరాలకు వెళ్దాం. రెండు శరీరాల కలయిక కోసం కాదు. రెండు మనసుల స్వాంతన కోసం. ఈ వయసులో నాకు నువ్వు, నీకు నేను. ఓదార్పుగా బ్రతుకుదాం. ఏ వేదమంత్రాలు, ఏ శాస్త్రోక్త సాంప్రదాయం మనకవసరంలేదు''

అతను ఆమె వడిలో తల పెట్టాడు. కిటికీలో నుండి వచ్చే చల్లగాలి వాళ్లలోని వార్ధక్యాన్ని వణికిస్తోంది.

బెర్త్‌మీద ఓ మూట అటూ ఇటూ వూగుతోంది. పెళ్లి తాలూకు సామాను కాబోలు. రైలు కుదుపులో ఆ మూట వాళ్లమీద పడింది. అందులో పసుపు, కుంకుమ అలా...అలా ఆమె వైధవ్యాన్ని ప్రక్షాళన చేస్తూ రాలిపడింది. తెల్లచీర పచ్చబడింది. బోసినుదురు ఎర్రబడింది. వినమ్రంగా తల వంచింది సౌమిత్రి. ప్రయాణీకులంతా గాఢనిద్రలో వున్నారు.

తన ఒళ్లో వున్న అతని తలమీద చేయి వేసింది. సంతృప్తిగా ఆ దృశ్యం అబ్బురంగా, అపురూపంగా వుంది. అక్కడ ఆనందం అర్థమైంది.

★